ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

పోచమ్మమైదాన్, జూలై 30: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల అభ్యాసకుల కోఆర్డినేటర్ ఎస్.అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు తెలిపారు. ఆగస్టు 18లోగా braouonline.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

చెన్నారావుపేట, జూలై 30: పరిశుభ్రత పాటిస్తేనే వ్యాధులు దరిచేరవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. బోడ మాణిక్యంతండా, చెరువుకొమ్ముతండాలో మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

1864 మందికి రుణమాఫీ

గీసుగొండ, జూలై 30: మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లోని 1864 మంది రైతులకు మంగళవారం రూ. 1.50 లక్షల రుణమాఫీ అయినట్లు ఏవో హరిప్రసాద్ బాబు తెలిపారు. కోనాయిమాకుల రైతు వేదికలో ఆయన జాబితా ప్రకటించారు.

నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

సంగెం/పర్వతగిరి, జూలై 30: సంగెం కేజీబీవీలో తాత్కాలిక నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. నైట్ వాచ్ ఉమెన్‌కు 10వ తరగతి, స్వీపర్‌కు 7వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులని, ఆగస్టు 2న సాయంత్రం 4 గంటల్లోగా కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అలాగే, పర్వతగిరి మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్ ఉమెన్, స్వీపర్ కమ్ స్కావెంజర్, హెడ్‌కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాని ఎంఈవో సత్యనారాయణరావు, నోడల్ అధికారి లింగారెడ్డి కోరారు. వివరాలకు 7680946704 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలి'

దుగ్గొండి, జూలై 30: ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు వెంటనే పెండింగ్ డబ్బులు చెల్లించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు మెండెం శ్రీలత డిమాండ్ చేశారు. ఈజీఎస్ కూలీల సమస్యలు, పెండింగ్ బిల్లులపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు అశోక్, కుమారస్వామి, బాషబోయిన అనిత, కడారి సురేశ్, కుమార్, మొగిలి పాల్గొన్నారు.

అదనపు కమిషనర్‌గా రాజేందర్‌రెడ్డి

వరంగల్, జూలై 30: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌గా ప్రసన్నరాణికి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తవాడలో చైన్ స్నాచింగ్

పోచమ్మమైదాన్, జూలై 30: కొత్తవాడలో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ఇదే ప్రాంతానికి చెందిన మహిళ మడేలయ్యగుడి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్తున్నది. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు అడ్డగించి మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల మంగళ సూత్రాన్ని లాక్కొని పరారయ్యారు. పోలీసులు వివరాలు సేకరించారు.

నడక యాతన..

రుద్రగూడెంలో ఇబ్బందులు పడుకుంటూ వెళ్తున్న వృద్ధులు

నల్లబెల్లి, జూలై 30: మండలంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. రుద్రగూడెలో బొడ్రాయి నుంచి చిన్న తండాకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. తారు రోడ్డు నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ. 70 లక్షల నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ కంకర పనులు పూర్తి చేశాడు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ రోడ్ల పనులను రద్దు చేసింది. దీంతో రోడ్లపై కనీసం బాటసారులు నడవలేని దుస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని వృద్ధులు నూటెంకి లక్ష్మి, అచ్చమ్మ, బోనగిరి మల్లక్క, సునీత కోరుతున్నారు.

సర్కారు బడిలో క్షుద్రపూజలు!



పసుపు కుంకుమ పోసి కొబ్బరికాయ పెట్టిన దుండగులు

నల్లబెల్లి, జూలై 30: ప్రభుత్వ పాఠశాలలో క్షుద్రపూజలు చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. ఆది, సోమవారం పాఠశాలలకు సెలవులు వచ్చాయి. తిరిగి మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోగానే ఆఫీస్ గది ఎదుట పసుపు, కుంకమ పోసి మధ్యలో కొబ్బరి కాయ పెట్టి ఉంది. వరండాల్లో మందు సీసాలు, గ్లాసులు, తినుబండారాలు దర్శనమిచ్చాయి. దీంతో పిల్లలు, టీచర్లు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

నర్సంపేట మున్సిపల్ కమిషనర్ బదిలీ

నర్సంపేట, జూలై 30: నర్సంపేట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కె.నర్సింహారెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ ఇదే జిల్లాకు బదిలీ అయ్యారు.

ఎంజీఎంలో భారీగా నర్సుల బదిలీ

వరంగల్ చౌరస్తా, జూలై 30: వరంగల్ ఎంజీఎం దవాఖానలో భారీగా నర్సులను బదిలీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బదిలీ కౌన్సిలింగ్‌కు 230 మంది హాజరు కాగా, వారిలో 80 మంది నర్సులు వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఎక్కువగా భద్రాద్రి కొత్తగూడెం జోన్‌కు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. విషజ్వరాలు ప్రబలుతున్నందున రోగులకు అందించే సేవలు ఆలస్యం కాకుండా వెంటనే పూర్తిస్థాయిలో నర్సుల నియామకాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి'

చెన్నారావుపేట, జూలై 30: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మండలంలోని ఉద్యమకారులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌడగాని రాజీరు, మండల అధ్యక్షుడు లింగమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు బండారి మంజుల, నూకల ముత్తయ్య, లక్ష్మణ్, వీరాసింగ్, రాములు పాల్గొన్నారు.

ఉషాభాస్కర్‌కు ఎక్సలెన్స్ అవార్డు

కాశీబుగ్గ, జూలై 30: వరంగల్ ఎనుమాములకు చెందిన సేవా స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ బీకాన్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఎక్సలెన్స్ అవార్డు-2024ను అడిషనల్ డీసీపీ నోడల్ ఆఫీసర్ ఎన్.రవి, ఏసీపీ, సీసీఆర్‌పీ డేవిడ్‌రాజు చేతుల మీదుగా అందుకున్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎఫ్ ఎంఎం సాంఘిక సంస్థ వారు ఈ అవార్డును అందజేశారు.

14,510 మందికి రుణమాఫీ

- బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ ఏర్పాటు
- టాస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు
- కలెక్టర్‌తో కలిసి రెండో విడుత రుణమాఫీ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న టాస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్

ఖిలావరంగల్. జూలై 30: జిల్లాలో 14,510 మంది రైతులకు రూ. 142.58 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని టాస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్‌లో రెండో విడుత రుణమాఫీ నిధుల విడుదలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి లైవ్‌ను వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు ఎదురైతే గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు తీసుకున్న, రెన్యువల్స్ చేసుకున్న రుణాలు వడ్డీతో సహా రూ. 2 లక్షల వరకు ప్రతి రైతు కుటుంబానికి మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. రైతు కుటుంబానికి రూ. 2 లక్షల కంటే అధికంగా రుణం ఉంటే కుటుంబంలోని మహిళ పేరుపై ఉన్న రుణం నిబంధనల మేరకు ముందుగా మాఫీ అవుతుందన్నారు. బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలోని 13 మండలాల రైతుల సౌకర్యార్థం రుణమాఫీ ఫిర్యాదుల పరిష్కారానికి మండలాల్లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామన్నారు. రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్స్‌కు వెళ్లి తమ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇప్పటికే రూ. లక్ష రుణం ఉన్న వారికి మాఫీ అయిందన్నారు. అనంతరం టాస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి చేతులమీదుగా రెండో విడుత రుణమాఫీ చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డీఏవో ఉషాదయాళ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, డీహెచ్‌వో శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడుత రుణమాఫీ కార్యక్రమం ప్రారంభమయ్యే సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేశారు. అయితే, కరెంటు కోతలు ఉండవంటూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటికే సమావేశానికి హాజరైన రైతులు అప్రకటిత విద్యుత్ కోతతో నవ్వుకోవడం కొసమెరుపు.

గీసుగొండ: గంగదేవిపల్లిలో పట్టుపురుగుల పెంపకాన్ని తెలుసుకుంటున్న అధికారులు

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

గీసుగొండ/వర్ధన్నపేట/సంగెం, జూలై 30: గీసుగొండ మండలంలోని మరియపురం, గంగదేవిపల్లిలో మంగళవారం కేంద్ర సచివాలయ గ్రూప్-1 బృందం ఫౌండేషన్ ట్రైయినింగ్ ప్రోగ్రాంలో భాగంగా పర్యటించింది. ఈ సందర్భంగా మరియపురంలో సభ్యులు వ్యవసాయ క్షేత్రాలు, జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, వైకుంఠధామం, డంపింగ్ యార్డును పరిశీలించారు. గంగదేవిపల్లిలో పట్టు పురుగుల పెంపకం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, ఈజీఎస్‌లో నాటిన పండ్ల తోటల పెంపకంలో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో చంద్రకాంత్, డీటీఎం కూసం రాజమౌళి, టీం ఇన్‌చార్జి సుధాకర్, రమేశ్, ఏవో హరిప్రసాద్ బాబు పాల్గొన్నారు. అలాగే, వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో రెండో రోజు కేంద్ర అధికారుల బృందం పర్యటన కొనసాగింది. జీపీ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. జాబ్‌కార్డుల జారీ, పనుల ఎంపిక, కూలీలకు కల్పిస్తున్న పనిదినాలు, కూలీలకు వస్తున్న దినసరి వేతనంపై చర్చించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సంగెం మండలం తీగరాజుపల్లిని కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఎంపీడీవో కె.రవీందర్, ఏపీవో గణేశ్, మాజీ సర్పంచ్ రంగరాజు నర్సింహాస్వామి పలు అంశాలను వివరించారు.

సకాలంలో మార్కెట్ ఫీజు చెల్లించాలి: కార్యదర్శి

వ్యాపారులతో మాట్లాడుతున్న ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల

కాశీబుగ్గ, జూలై 30: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులతో కార్యదర్శి పోలిపాక నిర్మల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ ఫీజు, షటర్ల అద్దెలను సకాలంలో చెల్లించాలని ఆమె సూచించారు. త్వరలోనే ఓపెన్ ప్లాట్ల చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అఖిల్(ఫైల్)

కరీమాబాద్, జూలై 30: ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. మంగళవారం మిర్చి లోడ్‌తో ఖమ్మం వైపు లారీ వెళ్తున్నది. ఐనవోలు మండలం సింగారం గ్రామానికి చెందిన ఆకులపెల్లి అఖిల్(24) వరంగల్ వైపు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ క్రాస్ వద్ద లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నర్సంపేట, జూలై 30: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన నాగమల్ల స్వాతి (35), రమేశ్ కుటుంబం అద్దె ఇంట్లో ఉంటూ ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. కరోనా సయమంలో రూ. 20 లక్షల మేర వ్యాపారంలో నష్టపోయి అప్పులపాలయ్యాయి. ఎలా తీర్చాలో తెలియక స్వాతి మానసికంగా కుంగిపోయింది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కొత్త రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలి'

చెన్నారావుపేట, జూలై 30: కొత్త రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టర్ సత్య శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. చెన్నారావుపేట సహకార సంఘంలో 3786 మంది కొత్త రైతులు సభ్యత్వం తీసుకున్నారని, వారందరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

'రైలు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి'

నెక్కొండ, జూలై 30: నెక్కొండలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రైల్వే అవేర్‌నెస్ ఫోరం ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. రైల్వే అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గోరంట్ల వెంకటనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్టేషన్ మాస్టర్, టికెట్ బుకింగ్ క్లర్క్‌కు వినతిపత్రం అందించారు. అలాగే, బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ రైల్వే జీఎం ఉదయ్‌నాథ్‌కోట్లను కలిసి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

గీసుగొండ, జూలై 30: విద్యుత్ సమస్యల పరిష్కారానికి మండలంలోని మనుగొండలో మంగళవారం అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మధుసూదన్ రావు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లూజు కనెక్షన్, స్తంభాలు, డీటీఆర్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలుంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు సంపత్‌రెడ్డి, ఆనందం, లైన్‌మెన్లు భిక్షపతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను అరెస్ట్ చేసిన పోలీసులు

'అరెస్టులు మాని హామీలు నెరవేర్చాలి'

నల్లబెల్లి/ఖానాపురం, జూలై 30: అరెస్టులు మాని, హామీలు నెరవేర్చాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో కాంటాక్ట్ ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న స్థానిక కాంటాక్ట్ ఉద్యోగులను మంగళవారం తెల్లవారుజామున ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఐకాస గౌరవ అధ్యక్షుడు, మెసెంజర్ల జిల్లా అధ్యక్షుడు సుద్దాల ఆనందం మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అరెస్ట్ అయిన వారిలో ఆశ కార్యకర్తలు, జీపీ సిబ్బంది ఉన్నారు. అలాగే, ఖానాపురంలో ఆశ వర్కర్లు విజయ, రమ, సంధ్య, స్వరూప, కవితను అరెస్టు చేసి సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో తమ డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడం అక్రమమన్నారు. ఆయన వెంట అల్లాపుద్దీన్ ఉన్నారు.

విధులకు ఎగనామం పెడితే చర్యలు

రాయపర్తి, జూలై 30: సమాచారం లేకుండా విధులకు ఎగనామం పెట్టే వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, వైద్య సిబ్బంది హాజరు పట్టికలు, రోగుల నమోదు పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

దుగ్గొండి/నర్సంపేట: జూలై 30: గత శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు పల్లె రమేశ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది సభ్యులతో కలిసి మంగళవారం మండలకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అశోక్, శానబోయిన రాజ్‌కుమార్, సోమన్న, నేరెడు సదానందం, అమర్‌చంద్, నరహరి పాల్గొన్నారు. అలాగే, శాసన సభలో ముదిరాజ్‌ల రిజర్వేషన్‌ను ప్రస్తావించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వినతిపత్రం ఇచ్చినట్లు రాష్ట్ర మెపా అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు.

రైతులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నెక్కొండ, జూలై 30: రైతులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని వైద్యులు సూచించారు. చంద్రుగొండలో పంట చేల వద్దకు వెళ్లి సీజనల్ వ్యాధులపై రైతులు, కూలీలకు నెక్కొండ పీహెచ్‌సీ వైద్యాధికారి సుమన్ ఆధ్వర్యంలో డాక్టర్ రాహుల్, వైద్య సిబ్బంది అవగాహన కల్పించి మందులు అందించారు. హెల్త్ అసిస్టెంట్ రవిచందర్‌రెడ్డి, ఏఎన్ఎం యాకలక్ష్మి పాల్గొన్నారు. అలాగే, చంద్రుగొండలో జడ్పీహెచ్ఎస్, పీఎస్‌లో డాక్టర్ రహీలా తన్వీర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

'తప్పుడు ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే చర్యలు'

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరీమాబాద్, జూలై 30: ఉద్యోగులు తప్పుడు ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే చర్యలు తప్పవని మామునూరులోని 4వ బెటాలియన్ కమాండెంట్ రామ్ ప్రకాశ్ హెచ్చరించారు. మామునూరులోని బెటాలియన్‌లో సిబ్బందికి మంగళవారం ఆయన ఆదాయ పన్నుపై అవగాహన కల్పించారు. తప్పుడు మినహాయింపులు, డిడక్షన్లు సమర్పించొద్దని రామ్‌ప్రకాశ్ సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రేంజ్-3 ఐఆర్ఎస్ తేజావత్ వెంకన్న, ఆదాయ పన్ను విభాగం అధికారి మహేందర్‌బాబు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్, జూలై 30: అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం నాయకులు కోటి, ఎర్ర నరేశ్, సురేశ్, మాతంగి నవనీత్, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

తపాలా పథకాలను వినియోగించుకోవాలి

కాశీబుగ్గ/నర్సంపేటరూరల్, జూలై 30: ప్రతి ఒక్కరూ తపాలా శాఖ అమలు చేస్తున్న పొదుపు పథకాలు, ఇతర సేవలను వినియోగించుకోవాలని వరంగల్ దక్షిణ ఉప మండలం సహాయ సూపరింటెండెంట్ పి.వరప్రసాద్ కోరారు. మంగళవారం 3వ డివిజన్ కొత్తపేటలో పోస్ట్‌మాస్టర్ ఎన్.మోహన్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. అలాగే, నర్సంపేట సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాదన్నపేట జీపీ కార్యాలయంలో తపాలా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

నర్సంపేట, జూలై 30: డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు మూడు బృందాలుగా ఏర్పడి మంగళవారం పట్టణంలోని వివిధ మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. గడువు దాటిన మందులు, రసీదులు, చిటీలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు పాటించని షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, No. 16121735P, Rank: Nk, Name: **AAKARAPU SHYAM,** Unit: 21 Engr Regt, S/o **AAKARAPU SATHYANARAYANA,** Residing at H.No. 3-97, Vill & PO: Ashoknagar, Taluk: Khanapur, Dist: Warangal, State: Telangana, PIN-506132 today camp at Leh Ladak, have changed my son name from **AAKARAPU SHREYANASH** to **AAKARAPU SHREYANSH** and will remain "so" in all further records.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

దళిత ఉద్యోగినికి వేధింపులు

జీపీ మల్టీపర్పస్ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కార్యదర్శి వేడుకోలు

సరస్వతి

నల్లబెల్లి, జూలై 30: ఓ దళిత ఉద్యోగిని వేధింపులకు గురవుతున్నది. తనను వేధిస్తున్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని రేలకుంట గ్రామ పంచాయతీలో నిబంధనల ప్రకారం ఐదుగురు మల్టీపర్పస్ వర్కర్లు పని చేయాల్సి ఉంది. గతంలో కార్యదర్శి రామారావు, ఎంపీవో ప్రకాశ్, సర్పంచ్ తీర్మానం చేసి ఏడుగురిని నియమించారు. ప్రస్తుతం రామారావు బదిలీ కాగా, ఆయన స్థానంలో సరస్వతి వచ్చారు. ఈ నేపథ్యంలో అదనంగా ఉన్న ఇద్దరు వర్కర్లలో మిడిదొడ్డి రాజు పనులు చేయకపోవడమే కాకుండా కార్యదర్శి సరస్వతిని నిత్యం వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరువయ్యారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సీఈవో రాంరెడ్డిని వివరణ కోరగా.. విచారణ జరిపి చర్యలు తీసుకుంట